బలగం
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | మంగళవారం జూన్ 10 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## విశాఖ ఉక్కులో ఘోర ప్రమాదం

**ద్రవ ఉక్కు ల్యాడిల్ పేలుడు.. ఎనిమిది మంది మృతి**

**ఇద్దరి పరిస్థితి విషమం.. ఉన్నత స్థాయి విచారణకు డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. స్టీల్ మెల్టింగ్ షాప్-1 (ఎస్ఎంఎస్-1)లోని కంటిన్యూయస్ క్యాస్టింగ్ డిపార్ట్‌మెంట్ (సీసీడీ) మిషన్-2 వద్ద 150 టన్నుల ద్రవ ఉక్కును తరలిస్తున్న సమయంలో ల్యాడిల్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో ఉక్కునగరం విషాదంలో మునిగిపోయింది.

సుమారు 1500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో ఉన్న ద్రవ ఉక్కు చుట్టుపక్కల ప్రాంతాలకు చెలరేగడంతో విధుల్లో ఉన్న కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సాయంత్రం 4.15 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పేలుడు శబ్దం కిలోమీటరు దూరం వరకు వినిపించినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఐదుగురు రెగ్యులర్ ఉద్యోగులు, ముగ్గురు కాంట్రాక్టు కార్మికులు మృతిచెందారు. మృతుల్లో గొంతిన భాను కుమార్ (టెక్నీషియన్), జి.వి. అప్పారావు,

మిగితా 2వ పేజీలో

### రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..

# గుజరాత్‌కు గులాంగిరి..

- మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అండ్డుకుంటున్నారు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సీఎం రేవంత్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు.

గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.

రూ.229 కోట్లతో ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ.29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ.26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికీ భూమిపూజ చేశారు. రూ.14.40కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం మియాపూర్‌లో 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సభకు మంత్రి శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమెల్యేలు అరికెపూడి గాంధీ, మాల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి

- జోగులాంబ గద్వాల జిల్లాను తాకినట్లు వెల్లడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. తాజాగా వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. రుతుపవనాలు జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా తెలంగాణలోకి అధికారికంగా ప్రవేశించాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వాతావరణం చల్లబడటమే కాకుండా, రాబోయే రెండు మూడు రోజుల్లో ఇవి మరింత బలోపేతం కానున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ అంతటా రుతుపవనాలు పూర్తిగా విస్తరిస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతుపవనాల రాకతో ముఖ్యంగా దక్షిణ , తూర్పు తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన జారీ చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు, అలాగే సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ రుతుపవనాల ప్రవేశం ఎంతో ఉపశమనాన్ని , సంతోషాన్ని కలిగిస్తోంది.



## టూరిజంకు కొత్త రూట్ మ్యాప్ సిద్ధం

- తొలి దశలో 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూప్లలి కృష్ణారావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ టూరిజంకు కొత్త రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూప్లలి కృష్ణారావు వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో పర్యాటక శాఖ ఉన్నతాధి కారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తొలి దశలో 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. వాటిని ప్రపంచ స్థాయి పర్యాటక గమ్య స్థానాలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక మాస్టర్ ఎక్ష్మి-లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించామన్నారు. 'స్లో టూరిజం'కు ప్రాధాన్యం ఇవ్వాలని వారికి సూచించినట్లు తెలిపారు. ప్రకృతి, చరిత్ర, సంస్కృతి కలగలిపిన పర్యాటక అనుభూతిపై దృష్టి సారించామని వివరించారు. వికారాబాద్, రామప్ప దేవాలయం, యాదాద్రి, భద్రాచలం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. భువనగిరిని దేశంలోనే అగ్రశ్రేణి హెరిటేజ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దే యోచన చేస్తున్నామన్నారు. కేరళలో జటాయు తరహాలో ఐకానిక్ ప్రాజెక్టులపై అధ్యయనం చేస్తున్నట్లు వివరించారు. స్కైవాక్‌లు, వ్యూడెక్స్, అడ్వెంచర్ యాక్టివిటీలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సోమశిలలో క్రూయిజ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్‌కు భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యాటక రంగం ద్వారా ఉపాధి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక మ్యాప్‌పై నిలపాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణను ప్రారంభించామని మంత్రి జూపల్లి కృష్ణారావు వివరించారు.

## కలిసికట్టుగా ఉంటేనే నిలబడతాం

- బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుదాం
- కూటమి పార్టీలకు రాహుల్ పిలుపు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

కలిసికట్టుగా ఉంటేనే నిలబడతామని, విడిపోతే పడిపోతామని లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషయాన్ని భాగస్వామ్య పార్టీలు గుర్తెరిగి, ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూట్ క్లబ్‌లో సోమవారంనాడు జరిగిన 'ఇండియా' కూటమి సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. కూటమి పార్టీలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలని అనుకోకుండా కలిసి కట్టుగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని, బీజేపీ నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. 'ఓటు చోరీ' వంటి పలు అంశాల విషయంలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం లోపించడం, కూటమిలో భాగస్వామ్యం కలిగిన కొన్ని పార్టీలు సైతం కాంగ్రెస్‌పై తరచు విమర్శలు చేస్తుండటంపై రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసారు. గత లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని, అయితే అంతర్గత కుమ్ములాటతోనే మనకు మనం బలహీనమవుతున్నాయనే విషయాన్ని విపక్షాలు గుర్తించాలని సూచించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు సాధించినప్పటికీ ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైంది. 2019లో 52 సీట్లు మాత్రమే సాధించిన కాంగ్రెస్ పార్టీ అనంతరం జరిగిన 2024 ఎన్నికల్లో 99 స్థానాలు గెలుచుకుంది. ఇటీవల లోక్‌సభలో విపక్షాలన్నీ ఏకతాటిపై నిలబడటంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విజన బిల్లు వీగిపోయింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జరిగిన సుమారు

నెలరోజుల్లోనే 'ఇండియా' కూటమి తాజాగా ఢిల్లీలో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో అస్సాం, బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించగా, కేరళలో కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాడులో టీవీకే విజయ్ విజేతగా నిలిచారు. పూర్తి మెజారిటీ రాకపోవడంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల మద్దతుతో అధికారం చేపట్టారు. కాగా, మూడేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ఏర్పడిన 'ఇండియా' కూటమి ఇకనుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని న్యూఢిల్లీ సమావేశంలో నిర్ణయించారు. తదుపరి సమావేశం వచ్చే ఆగస్టులో హైదరాబాద్‌లో జరుపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు.

## చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలు

**ఏపీకి తరలిస్తున్న 9 లారీల సీజ్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చేపలకు ఆహారంగా ఉపయోగించేందుకు తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు నగరంలో హెచ్ ఫాస్ట్ పోలీసుల బృందం భారీ ఆపరేషన్ చేపట్టింది. చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న 9 లారీలను సీజ్ చేసింది. 120 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకుంది. ఆ వ్యర్థాలను చెరువుల్లో చేపలకు ఆహారంగా వాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని రెండరింగ్ ప్లాంట్‌కు పంపాల్సిన వ్యర్థాలను మళ్లించి ఏపీలోని గుంటూరు, వినుకొండ, అద్దంకి, భీమవరంలోని చెరువులకు వీటిని తరలిస్తున్నట్లు సమాచారం. జీహెచ్ఎంసీ పరిధిలోని రెండరింగ్ ఎక్ష్మి-లాంట్‌కు పంపాల్సిన వ్యర్థాలను దారి మళ్లించినట్లు గుర్తించారు. చికెన్ వ్యర్థాలు తిన్న చేపలను మనుషులు తింటే ఆరోగ్యానికి ప్రమాదకరమని పోలీసులు తెలిపారు.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

**మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి**

**మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి**

**రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ పిలుపు**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అక్ష్మి-దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అక్ష్మి-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ

మిగితా 2వ పేజీలో

## పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ



- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల సహకారం
- అధికారులను ఆదేశించిన

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎల్‌ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్ లు పెట్రోలింగ్ ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో మంగళవారం

మిగితా 2వ పేజీలో

## హర్మ్యూజ్ వద్ద బారత ప్రయాణికుల నౌకపై దాడి

**దాడిలో తీవ్రంగా దెబ్బతిన్న ఇంజన్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, భారతీయులు ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌక దాడికి గురైనట్టు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఈ దాడి జరగ్గా.. ఆ సమయంలో నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. దీంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్టు వార్తలు వస్తున్నాయి. పలావు దేశ జెండాతో వెళ్తున్న నౌక ఒమన్ తీరానికి దగ్గర్లో ఉన్న సమయంలో ఈ దాడి జరినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఆ నౌకలో 24 మంది భారతీయులున్నట్టు సమాచారం. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ దెబ్బతిందని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్ఓఎస్ కాల్ పంపినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ దాడి కారణంగా నౌకలోని లైఫ్ బోట్లు కూడా దెబ్బతిన్నట్టు సమాచారం. దాడి కారణంగా ఆ ఓడలో పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. లైఫ్‌బోట్లు కూడా దెబ్బతినడంతో తరలింపు ప్రక్రియ సంక్లిష్టంగా మారినట్టు సమాచారం. కాగా, నౌకపై క్షిపణులు లేదా డ్రోన్‌లతో దాడి జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ దాడికి బాధ్యులు ఎవరనే విషయంలో స్పష్టత లేదు. ఈ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

# పెన్షన్ డబ్బు కోసం వ్యక్తి దారుణ హత్య

## భార్యకు జీవిత ఖైదు...కొడుకుకు, కుమార్తెకు మరణశిక్ష

## మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు

**బలగం టీవి, హైదరాబాద్**

పింఛను డబ్బు కోసం వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మృతుడి భార్యకు జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు మరణ శిక్ష విధిస్తూ మాల్కాజిగిరి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2019 ఆగస్టులో విశ్రాంత రైల్వే ఉద్యోగి కిషన్ సుతార్(70)ను పింఛను డబ్బు కోసం అతని భార్య, కుమారుడు, కుమార్తె కలిసి హత్య చేసి ముక్కలుగా నరికారు. అనంతరం ఆ శరీర భాగాలను ఆరు బకెట్లలో నిల్వచేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మృతుడి భార్య గంగాబాయికి జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు ఉరి శిక్షను విధిస్తూ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు తీర్పు ఇచ్చారు.



# రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం

## అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం వెల్లడి

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చెక్ పెడతామన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రా పేపర్ మిల్స్‌తో గోదావరిని కాలుష్యం

## షోకాజ్ నోటీసులు జారీ చేయండి

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం

**బలగం టీవి, అమరావతి**

గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ రోజు సేకరించిన నమూలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో పవన్ సమీక్షించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

## స్టీరింగ్ రాడ్ విరిగి పంటపొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

**బలగం టీవి, అమరావతి**

కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. అయితే బస్సులో ప్రయాణిస్తున్న 20మంది ప్రయాణికులు చిన్న గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గన్నవరం డిపోకు చెందిన 220 నంబర్ ఆర్టీసీ బస్సు తెన్నేరు నుంచి గన్నవరం వైపు వెళ్తుండగా, తెన్నేరు?మంతెన మధ్య మార్గంలో ఒక్కసారిగా స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి బస్సులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉండగా ముగ్గురికి గాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

## రాజ్యసభ ఎంపి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా

**బలగం టీవి, హైదరాబాద్**



టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దిల్లీలో నేడు జరగనున్న ఇండియా కూటమి కీలక భేటీలో పాల్గొనడానికి మమత దేశ రాజధానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# బైకును తప్పించబోయి ఆటో బోల్తా

## ఆటోలోని ఒక్కరికీ తీవ్ర గాయాలు

## మరొకరికి స్వల్ప గాయాలు

**బలగం టీవీ బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక చౌరస్తాలో బైక్ను తప్పించబోయి ఆటో బోల్తా పడి ఒక్కరికీ తీవ్ర గాయాలు కాగా ఒకరు స్వల్ప గాయాలు అయ్యాయి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గారావుపల్లి నుండి కొదురుపాక చౌరస్తా వద్ద వేములవాడకు చక్రవాహనం చౌరస్తా దగ్గర సడన్గా తిరుగుతుండగా వేములవాడ నుండి బావుపేట మార్కెట్ వెళుతున్న ఆటో సడెన్ గా బైకు ఎదురుగా రావడంతో బైకును తప్పించబోయి ఆటో బోల్తా పడింది ఆటోలో ఉన్న మహిళకు తీవ్ర గాయాలు కాగా డ్రైవింగ్ చేస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయని తెలిపారు. వారిని స్థానికులు 108 కు ఫోన్ చేసి సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పంపించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# గురుకులాల్లో అడ్మిషన్ల నుంచి పూర్తి పారదర్శకత పాటించాలి

## విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు

## ఫుడ్ పాయిజన్ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు

## సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్**



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోని పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలని, విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు. జూన్ విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్) పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అయితే సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు. ఇటీవలి కాలంలో కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనలను ప్రస్తావించిన మంత్రి, గురుకులాల్లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట ప్రక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

ంటశాలలు, స్టోర్‌రూమ్‌లు, డైనింగ్ హాల్స్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. అకడమిక్ పరంగా ఈ విద్యా సంవత్సరాన్ని మరింత ఫలవంతంగా మార్చేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. పీరియడ్ వారీగా పాఠ్యాంశాల బోధన, వారాంత సమీక్షలు, నెలవారీ విద్యా ప్రగతి నివేదికలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రవేశాల పక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని, అడ్మిషన్ల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం లేదా అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, విద్యుత్ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, హాస్టల్ గదులు, వంటశాలలు, మరుగుదొడ్ల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. క్ష్మీ-రతి విద్యార్థిని తమ సొంత పిల్లలుగా భావించి చూసుకోవాలని మంత్రి సూచించారు. వారి విద్యా ప్రగతి మాత్రమే కాకుండా ఆరోగ్యం, మానసిక స్థితి, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. గురుకులాలు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే కేంద్రాలు కాకుండా, సమాజానికి బాధ్యతగల పౌరులను తయారు చేసే సంస్థలుగా నిలవాలని పేర్కొన్నారు. పాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. సిబ్బంది సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, పరిపాలనా సమస్యలపై సంస్థ యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చించి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిబ్బంది సంతృప్తి, విద్యార్థుల విజయానికి పరస్పర సంబంధం ఉందని, అందుకే ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణ గురుకులాలను దేశంలోనే అత్యుత్తమ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్‌ఏసీ) కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి. శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీ (అకౌంట్స్) చిన్న సాయిలు, ఓఎస్‌డీ వై.జే. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చేప ప్రసాద పంపిణీ ప్రారంభం

## మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో భారీ ఏర్పాట్లు

## దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన ఆస్తమా బాధితులు

**బలగం టీవి, హైదరాబాద్**



మృగశిర కార్తె సందర్భంగా చేప మందు ప్రసాద పంపిణీ కార్యక్రమం సోమవారం రాత్రి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. బత్తిని కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ఆస్తమా, ఉబ్బసం బాధితులు తరలివచ్చారు. దీంతో ఎగ్జిబిషన్ మైదానం సందడిగా మారింది.కార్యక్రమాన్ని మాజీ ఎంపీ వి. హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి చేప మందు ప్రసాదాన్ని మాజీ ఎంపీ హనుమంతరావు, మెట్టు సాయికుమార్‌లకు బత్తిని అమర్‌నాథ్ గౌడ్ అందజేశారు.

ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ బత్తిని కుటుంబం గత 177 సంవత్సరాలుగా చేప మందు ప్రసాదాన్ని పంపిణీ చేస్తూ ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆస్తమా బాధితులు ఈ ప్రసాదాన్ని స్వీకరించేందుకు రావడం ప్రజల్లో దీనిపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. చేప మందు ప్రసాద పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ప్రసాదం స్వీకరించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గత 15 రోజులుగా 14 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం 24 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో భద్రత, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్ గౌడ్, గౌరీశంకర్, చంద్రశేఖర్, సంతోష్, శివశంకర్, దీపిక, విజయ, శైలజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు

చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 క్మీర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరపున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది.శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు.చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

# సమర్థవంతంగా కేసుల పరిష్కారం

## సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి సివి ఆనంద్

**బలగం టీవి, హైదరాబాద్**

పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సీసీడీఎన్ఎస్ 2.0(క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం), ఈ-సాక్ష్య అమలుపై డైరెక్టర్ జనరల్ పోలీస్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా నేరాలు, నేరస్తుల సమాచారాన్ని వేగవంతంగా నమోదు చేయడంతో పాటు దర్యాప్తు పక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రజలకు అందించే సేవలను మరింత పారదర్శకంగా, సమ్మర్థవంతంగా చేయడంపై డీజీపీ సూచనలు చేశారు. ఈ-సాక్ష్య వ్యవస్థ ద్వారా నేర సంఘటనకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు సేకరించడం, భద్రపరచడం, కోర్టు విచారణలో సమర్పించే విధానాన్ని మరింత స్పటిష్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. సంబంధిత అధికారులు ఈ వ్యవస్థల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ వ్యవస్థను ఆధునికరించడం, దర్యాప్తు నాణ్యతను పెంపొందించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారుల నుండి డిజిటల్ వ్యవస్థ అమలు పురోగతిపై వివరాలు తెలుసుకొని, అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సీటీసీ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్బీ, సీపీఆర్ సీఐలు అంజయ్య, వీరయ్యతోపాటు సీఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్స్ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, రేషన్ టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల పరిసర చెరువులను కాపాడండి

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన జీవన్ రెడ్డి

**బలగం టీవి, జగిత్యాల**

జగిత్యాల అర్బన్, రూరల్ మండల పరిధిలో చెరువులు, కుంటలకు హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవన్ రెడ్డి ప్రజావాణిలో ఆర్డీఓ మధుసూదన్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంటలు ప్రధానమైన అంశమని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువులు, కుంటలు ఎక్కడా ఆక్రమణకు గురైన కానీ ఆక్రమణలను తొలగింప చేసి చెరువులను పునరుద్ధింపజేయడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా వచ్చేసరికి మోతే చెరువు, ముప్పారపు చెరువు, జగిత్యాల పట్టణ సరిహద్దులో ఉన్నాయి. పట్టణ సరిహద్దుల్లో ఉండడంతోని పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నాయని తెలిపారు. చెరువులను మట్టితో నింపేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని, దీనివల్ల భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చేపల వృత్తిలో ఉన్న మత్స్య కార్మికులు వారి వృత్తికి ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. మోతే గ్రామంలోని ముప్పారపు చెరువు సంబంధించి పలు పర్యాయాలు కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేయాలని, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ నిర్ధారణ చేయడంతో పాటుగా వాటి పరిధి లోపల మట్టితో నింపిన ఆక్రమణలు తొలగింపు చేయాలని విజ్ఞప్తి చేశారు. జగిత్యాల సరిహద్దుల్లో ఉన్న ముప్పారపు చెరువు, తిమ్మాపూర్, రఘురాములకోట, తిప్పన్నపేట, చెరువుల ఆక్రమణలను తొలగించి ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ నిర్ధారించాలన్నారు. అలాగే సారంగాపూర్ మండలానికి సంబంధించి నాగులకుంటా మత్స్య సహకార సంఘ సభ్యులు వీరు సమాజంలో అధిక జనాభా ముదిరాజులేదనని, వారి సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోను విజ్ఞప్తి చేశారు. ఆర్డీవో సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

## మెడికల్ బోర్డు తదితర సమస్యలుపై సమ్మె నోటీసు

**బలగం టీవి, గోదావరిఖని**

సింగరేణి సంస్థలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి యాజమాన్యానికి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ సోమవారం సమ్మె నోటీసు జారీ చేసింది. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం ఇతర సమస్యలను పరిష్కరించక పోవడంతో విసిగి వేసారిన గుర్తింపు కార్మిక సంఘం చివరకు సమ్మె చేయడం తప్ప మరో మార్గం లేదని సమ్మె నోటీసు జారీ చేసింది.యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఆధ్వర్యంలోని నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. కాగా ఎప్పటినుండి సమ్మె చేయాలని విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇదిలావుంటే సింగరేణి సంస్థలో వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని విజిలెన్స్ మారు పేర్ల సమస్యను పరిష్కరించాలనే డిమాండ్ తో ఈనెల 13న గోదావరిఖనిలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి తెలిపారు. గోదావరిఖని పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకుండా డిపెండెంట్ ఉద్యోగాలను అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడానికి గోదావరిఖని పట్టణంలోని విఠల్ నగర్ హనుమాన్ టెంపుల్ నుండి రామగుండం డివిజన్-1 జనరల్ మేనేజర్ కార్యాలయానికి చేపట్టిన భారీ పాదయాత్ర ఉంటుందని చెప్పారు. ఈ పాదయాత్రకు పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు డిపెండెంట్లు హాజరు కావాలని నిరసన తెలియజేయాలని ఆయన కోరారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థలు 18 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా మెడికల్ బోర్డు నిర్వహించకుండా కాలయాపన చేస్తోందని ఆయన విమర్శించారు. గతంలో డిపెండెంట్ ఉద్యోగాలు పొందిన వారిపై విచారణ చేపడతామని చెప్పడం చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వైఖరితో ఉందనేది అర్థమవుతుందన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలు ఇతర అంశాలపై మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న పోరాటానికి మద్దతుగా స్థానికంగా సింగరేణి ఉద్యోగుల డిపెండెంట్ లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# కిచెన్‌లో జారిపడిన మహిళ... చికిత్స పొందుతూ మృతి..



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మల్లుపల్లి లావణ్య ఇంట్లో కిచెన్ లో పనిచేస్తుండగా జారిపడి తలకు బలమైన గాయమై చికిత్స పొందుతుండగా ఇవాళ మృతి చెందింది.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మల్లుపల్లి రమేష్ భార్య లావణ్య (48) శనివారం ఇంట్లో కిచెన్ లో పని చేస్తుండగా కింద పడింది.. వెంటనే స్థానిక హాస్పిటల్కు తరలించారు.. తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించి సర్జరీ చేయించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు సమాచారం. మృతురాలికి భర్త రమేష్ ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.



# వేములవాడలో భక్తురాలిపై దాడి చేసి దొంగతనం

## 24 గంటల్లోనే దొంగల అరెస్ట్..

**బలగం టీవీ,వేములవాడ:**

వేములవాడ ఎస్.ఆర్.ఆర్. పార్కింగ్ వద్ద భక్తురాలి మెడలోంచి బంగారు మంగళసూత్రాన్ని లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. న్యాల్కల్ గ్రామానికి చెందిన నవనీత భక్తురాలు స్వామి దర్శనం కోసం వచ్చి పార్కింగ్ వద్ద నిద్రిస్తుండగా, దుండగులు ఆమెపై దాడి చేసి 20.120 గ్రాముల మంగళసూత్రాన్ని లాక్కుని పరారయ్యారు.

బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన టౌన్ పోలీసులు, గాలింపు చేపట్టి సిద్ధిపేట జిల్లాకు చెందిన అకమ్మ అశోక్, పంజా చందులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు సిద్ధిపేటలో దొంగిలించిన బైక్ పై వచ్చి ఈ నేరానికి పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి బంగారు మంగళసూత్రంతో పాటు ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్ఐ రాంమోహన్ మరియు సిబ్బందిని ఇన్స్పెక్టర్ అభినందించారు. భక్తులు విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



# ప్రయివేట్ పాఠశాల అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**

తంగళ్ళపల్లిలోని చైతన్య సరస్వతి (శుభోదయ) ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం అక్రమాలపై నర్సింహులపల్లెకు చెందిన బొంగురపు జనార్ధన్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు, అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన, ఆటస్థలం లేకపోవడం వంటి సమస్యలతో పాటు విద్యార్థుల రవాణాలో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. స్కూల్ బస్సుల్లో సెక్యూరిటీ లేకపోవడం, సరైన డ్రైవర్లు లేకపోవడం, అసిస్టెంట్లు లేకుండా బస్సులను నడపడం మరియు బస్సు సామర్థ్యానికి మించి పిల్లలను తరలించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన తల్లిదండ్రులను యాజమాన్యం పోలీసులతో బెదిరింపులకు గురిచేస్తోందని తెలిపారు. అక్రమార్జనే ధ్యేయంగా సాగుతున్న ఈ పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని జనార్ధన్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు.

# గుండెపోటుతో ఎల్లారెడ్డిపేట మండల వాసి మృతి



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట :**

బతుకుదెరువు కోసం వెయ్యి ఆశలతో గల్ఫ్ దేశానికి వెళ్లిన ఓ వలస జీవి మృత్యువాత పడ్డాడు. మస్కట్‌లో ఉపాధి పొందుతున్న ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బత్తుల నర్సింహులు (50) గుండెపోటుతో మరణించడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కుటుంబ పోషణ కోసం, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు నర్సింహులు గత 12 ఏళ్లుగా మస్కట్ వెళ్తూ వస్తున్నారు. ఎప్పటిలాగే అక్కడ పని చేసుకుంటుండగా, గుండెపోటు రావడంతో ఆయన అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. నర్సింహులుకు భార్య రేన, కుమారుడు రాకేష్ ఉన్నారు. తన తండ్రి బాటలోనే నడిచిన కుమారుడు రాకేష్ కూడా ప్రస్తుతం దుబాయ్‌లోనే ఉపాధి పొందుతున్నాడు.

తండ్రి మరణవార్త తెలుసుకున్న రాకేష్, కడసారి చూపు కోసం దుబాయ్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. వేల మైళ్ల దూరంలో ఉన్న మస్కట్ నుండి తమ కుటుంబ పెద్ద మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి రప్పించాలని భార్య రేన, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రభుత్వం మరియు అధికారులను వేడుకుంటున్నారు. కన్నతల్లిని, భార్యను, పిల్లలను విడిచిపెట్టి వెళ్లిన నర్సింహులు శవమై వస్తుండటంతో, గ్రామంలోని ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

## - ఎస్పీ మహేష్ బి.గీతే

## -గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 26 ఫిర్యాదులు స్వీకరణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గీతే తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ ఆఫీస్ లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులను ఎస్పీ మహేష్ బి.గీతే స్వీకరించినారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గీతే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, వేములవాడ :**

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం పరిశీలించారు.ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? ఎంత తరలించారో ఆరా తీశారు.ఈ సందర్భంగా వర్షానికి ధాన్యం తడువగా, జిల్లా కలెక్టర్ తేమ యంత్రంతో ధాన్యం తేమ శాతం పరిశీలించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ తో వెంటనే మాట్లాడి.. లారీలు సమకూర్చాలని ఆదేశించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోళ్లలో వేగం పెంచాలని, వెంట వెంటనే ధాన్యం తరలించాలని సూచించారు. కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు పంపాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం నిలువలకు అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు.పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, తహసీల్దార్ అబూబాకర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామసభలో అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం..




**బలగం టీవీ,ఇల్లంతకుంట :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ సభలో, సమస్యల పరిష్కారం కంటే అధికారుల నిర్లక్ష్యంపైనే చర్చ ఎక్కువగా జరగడంతో గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ముఖ్యంగా గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై వివరణ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ ఏఈ సభకు హాజరుకాకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం బాధ్యతాయుతమైన అధికారి అందుబాటులో లేకపోవడంపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇదే సమయంలో, ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' పథకంపై గ్రామస్తులు ఆశతో ఎంపీడీఓను వివరాలు కోరగా, ఆమె సమాధానం దాటవేయడం పరిస్థితిని మరింత వేడెక్కించింది. ఈ సభ ఇండ్లకు సంబంధించినది కాదంటూ ఎంపీడీఓ శశికళ తేల్చి చెప్పడంతో, తమకు న్యాయం జరుగుతుందని ఎన్నో ఆశలతో సభకు వచ్చిన నిరుపేదలు, లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. సభలో చోటుచేసుకున్న ఈ పరిణామాల పట్ల వార్డు సభ్యుడు మల్యాల రాజశేఖర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరడం లేదని విమర్శించారు. సర్పంచ్, ఎంపీడీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు హాజరైన ఈ సభ, ఆశించిన ఫలితాలను ఇవ్వకుండానే ముగిసింది.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు.ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.




# దివ్యాంగులకు ట్రై సైకిల్, వీల్ చైర్ అందజేత.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పలువురు దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పందించి.. సమస్యకు పరిష్కారం చూపారు.ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన చింతకింది లస్మయ్య, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముద్రకోల దీన దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి రాగా, వారితో కలెక్టర్ మాట్లాడారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తక్షణమే స్పందించి చింతకింది లస్మయ్య కు మాన్యువల్ ట్రై సైకిల్, ముద్రకోల దీనకు వీల్ చైర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారికి వెంటనే మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో స్పందించి మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ అందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అభివృద్ధి-సంక్షేమమే ప్రధాన లక్ష్యం



## --మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**బలగం టీవీ, వేములవాడ :**

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలనే గొప్ప సంకల్పంతో అభివృద్ధి-సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం 20వ వార్డులోని ముదిరాజ్ కాలనీలో స్థానిక కౌన్సిలర్ కుమ్మరి శంకర్ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు.ఈ సభ కి ముఖ్యఅతిథి చైర్మన్ పుల్కం రాజు హాజరై మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని, ముఖ్యంగా ఈ వార్డులో అన్ని వర్గాల ప్రజలు తమ కులవృత్తులను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తారని పేర్కొన్నారు.వార్డు అభివృద్దే తన నిత్యవృత్తిగా స్థానిక కౌన్సిలర్ కుమ్మరి శంకర్ పనిచేస్తున్నారని అన్నారు.20వ వార్డు అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు.పరిశుభ్రమైన వార్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.డ్రైనేజీ సమస్యలు ఎక్కడైనా తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు.వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు.నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి మట్టితో నింపే కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు.తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు తన చివరి శ్వాస వరకు సేవా చేయడమే తన ప్రధాన లక్ష్యమని కుమ్మరి శంకర్ వెల్లడించారు.ఈ సభలో మహిళా తల్లులు పాల్గొని ఆనందం వ్యక్తం చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు.వార్డు అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం,సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు,ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు రేగుల మల్లికార్జున్,నాయకులు బొడిగే శేఖర్,చిక్కుడు మల్లేశం లతో పాటు పెద్ద ఎత్తున మహిళలు,స్థానిక వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నక్ష (నేషనల్ జియో స్పాషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబీటెషన్స్) సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు.నక్ష సర్వే పురోగతి తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ మాట్లాడి.. సర్వే ఎక్కడి వరకు పూర్తి చేశారో ఆరా తీశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నక్ష కింద దేశంలోని 150 అర్బన్ లోకల్ బాడీస్ ను ఎంపిక చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీలు ఎంపిక చేశారని తెలిపారు. జూలై నెలాఖారులోగా మొత్తం సర్వే ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**పకడ్బందీగా పూర్తి చేయిస్తాం..**

వేములవాడ మున్సిపల్ పరిధిలో నక్ష కార్యక్రమం కింద ఐదు విలీన గ్రామాల్లో కలిపి మొత్తం 307 బ్లాక్స్ ఉన్నాయని, ఇప్పటివరకు 49 పూర్తి చేశామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. 14, 984 ఇండ్లు ఉండగా, 6707 ఇండ్ల సర్వే పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రతి ఒక్క ఇంటి సరిహద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఇతర ఖాళీ స్థలాల విస్తీర్ణం వివరాలు పకడ్బందీగా పూర్తి చేయిస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అఫ్ సర్వే శ్రీనివాస్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, టీపీఓ అన్సార్ తదితరులు ఉన్నారు.





# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా !

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**24 క్యారెట్ల ధర .1,51,690కు చేరిక**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

గత వారమంతా తగ్గిన బంగారం ధరలు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ వారం మొదటి రోజునే మళ్లీ ధరల్లో కోత పడింది. భారత్‌లో మేలిమి బంగారం ధర సగటున రూ.1000 మేర తగ్గింది. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు పడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే ధరలో రూ.1,040ల మేర కోత పడింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి కూడా రూ.950ల మేర తగ్గి రూ.1,39,050కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి రూ.2.7 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,700గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,51,690ల వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల పసిడి రూ.1,39,050ల వద్ద ట్రేడవుతోంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది. వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.6 లక్షల నుంచి రూ.2.7 లక్షల మధ్య కొనసాగుతోంది.




# అజ్మాన్‌లో అట్టహాసంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు -

**-ఘనంగా నిర్వహించిన ఈటి సిఎ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

అజ్మాన్‌లోని హ్యాబిటెట్ స్కూల్ ఆడిటోరియం వేదికగా, ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక మరియు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ అస్థిత్వ వేదిక ఛైర్మన్, ప్రముఖ ఉద్యమ నాయకులు వి. ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 'జయ జయ హే తెలంగాణ' రాష్ట్ర గీతంతో వేడుకలు మొదలయ్యాయి. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన 1569 మంది అమరవీరులకి నివాళులర్పించారు.?ఈ సందర్భంగా ఈటి సిఎ వ్యవస్థాపక అధ్యక్షులు కిరణ్ కుమార్ పీచర మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావం వెనుక ఉన్న దశాబ్దాల పోరాటాన్ని, వేలాది త్యాగాలను గుర్తు చేశారు. ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ మేధస్సు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దూరదృష్టి నాయకత్వాన్ని కొనియాడారు. విద్యార్థులు, మేధావులు, కళాకారుల కృషి చేశారని, తెలంగాణ భాషా సంస్కృతులకు పునర్జీవం పోసిన ఘనత ఉద్యమకారులదేనని అన్నారు .?ప్రస్తుత ప్రభుత్వం 'జయ జయ హే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో గల్ఫ్ వలసదారుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని, మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రకటించిన రూ. 5 లక్షల పరిహారాన్ని పాత కేసులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముఖ్య అతిథి వి. ప్రకాష్ మాట్లాడుతూ, మాతృభూమికి దూరంగా ఉన్నా తెలంగాణ సంస్కృతిని కాపాడుకుంటూ, ఉద్యమ చరిత్రను విదేశాల్లో చాటిచెబుతున్న ఈటి సిఎ సభ్యుల కృషిని అభినందించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని వివరించడమే కాకుండా,ఈటి సిఎ గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వీడియో ప్రదర్శన ద్వారా తిలకించి పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రముఖుల వేషధారణలు, మహిళా విభాగం సభ్యుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినోద్-విపుల దంపతుల స్కిట్ మరియు గాయకుడు మల్లేష్ కోరేపు ఆలపించిన పాటలు సభికులను అలరించాయి.?ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రాధారపు సత్యం, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ అలిగేటి, శేఖర్ గౌడ్, తిరుమల్ రావు, వినోద్ కుమార్ తదితర ముఖ్య సభ్యులు, వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో తెలంగాణ వాసులు పాల్గొన్నారు.

# నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**పేపర్ తయారీ నుంచి, ప్రింటింగ్ వరకు సీక్రసీ**

**పేపర్ తయారీదారులంతా రహస్య ప్రదేశానికి తరలింపు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**




మే 3న జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే రీ టెస్ట్‌ను అత్యంత పారదర్శకంగా, లీకులకు ఏమాత్రం తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ భద్రతా వ్యూహాన్ని సిద్ధం చేశాయి. ఈసారి క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వకుండా ఉండేందుకు ఏకంగా భారత వైమానిక దళం సహాయం తీసుకోనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్య జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో క్వశ్చన్ పేపర్లను ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే రవాణా సమయంలోనే లీకేజీ ముఠాలు చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో సరికొత్త చర్యలు చేపడుతున్నారు. దీని ప్రకారం.. క్వశ్చన్ పేపర్లను అత్యంత సురక్షితమైన ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. దీనివల్ల రవాణాలో జరిగే ఆలస్యం తగ్గడమే కాకుండా.. అనధికారిక వ్యక్తులు క్వశ్చన్ పేపర్లను తాకే అవకాశం కూడా ఉండదు. ఈసారి భద్రతను ఏ స్థాయిలో పటిష్టం చేశారంటే.. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష జరిగే జూన్ 21వ తేదీ వరకూ ఒక రహస్య ప్రాంతంలో పూర్తిగా నిర్బంధంలో ఉంచారు. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. క్వశ్చన్ పేపర్ల బాక్సులకు హైటెక్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా

పరిశీలిస్తారు. రీ-ఎగ్జామ్‌కు ముందు సోషల్ మీడియాలో నకిలీ పేపర్లు అమ్ముతూ విద్యార్థులను మోసం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు.. మరోవైపు సైబర్ విభాగాన్ని రంగంలోకి దించారు. గతంలో జరిగిన తప్పుల కారణంగా పరీక్ష రద్దయినందున, ఈ రీ-టెస్ట్ కోసం హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం లేదని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. దీనికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్టీఏ కోరింది. మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్లు సహా ఈ పక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచారని తెలిపాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలేవీ వీరికి అందుబాటులో ఉంచలేదట. కేవలం అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ పూర్తయ్యేంతవరకు వీరు ఈ లాక్‌డౌన్‌లోనే ఉండనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారు. ఇదిలాఉండగా.. రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. దీన్ని ఎన్టీఏ తీవ్రంగా ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ జరగనుంది.

# తృణమూల్ నేత జంగీర్ ఖాన్ అరెస్ట్

**దేశ సరిహద్దులు దాటుతుండగా పట్టివేత**

**ఖాన్‌పై పలు కేసులు నమోదు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలవరం సృష్టించిన తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత జహంగీర్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. గత కొన్ని రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సోమవారం తెల్లవారు జామున వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుంది. దేశం దాటి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా నేపాల్ సరిహద్దు ప్రాంతంలో నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఎస్టీఎఫ్ అధికారులు ఆయన ఆట కట్టించారు. జహంగీర్ ఖాన్‌పై బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా ఫాల్టా పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 క్రిమినల్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా ఓటర్లను భయభ్రాంతు లకు గురిచేయడం, భూఅక్రమణలు, మహిళలను వేధించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తనపై

నమోదైన వరుస కేసుల్లో పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని జహంగీర్ ఖాన్ గతంలో కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మే 18న కోర్టు ఆయనకు తాత్కాలిక ఉపశమనం కల్పించి నప్పటికీ, తాజాగా ఆ రక్షణను న్యాయస్థానం ఉపసంహరించుకుంది. కేవలం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయనో, లేదా దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే పిటిషనర్ వాదనల ఆధారంగా క్రిమినల్ కేసుల్లో రక్షణను పొడిగించలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తన క్లయింట్‌పై కావాలనే వరుస కేసులు పెట్టారని, ఇదంతా రాజకీయ పగతో జరుగుతున్న వేధింపులని జహంగీర్ ఖాన్ తరపు సీనియర్ న్యాయవాది కిషోర్ దత్తా కోర్టులో వాదించారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ ఈ వాదనను గట్టిగా వ్యతిరేకించారు. మే 21న ఫాల్టా నియోజకవర్గంలో జరిగిన రీ-పోలింగ్‌లో ఖాన్ పాల్గొనేందుకు మాత్రమే గతంలో కోర్టు రక్షణ ఇచ్చిందని, మే 24న ఫలితాలు కూడా వచ్చేసినందున ఇక ఆ ప్రొటెక్షన్‌ను పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా, ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గ రీ-పోలింగ్ సమయంలో బెంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గట్టి షాక్ ఇస్తూ జహంగీర్ ఖాన్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఫాల్టా ప్రాంత ప్రజల సంక్షేమం కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. 'నేను ఫాల్టా బిడ్డను. ఇక్కడ ప్రశాంతత, అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నాను. మన ముఖ్యమంత్రి సువేందు అధికారి ఫాల్టా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటిస్తున్నారు. అందుకే నేను ఈ రీ-పోలింగ్ రేస్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను' అని జహంగీర్ ఖాన్ పేర్కొనడం గమనార్హం. జహంగీర్ ఖాన్ నామినేషన్ ఉపసంహరణపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ ప్రభుత్వం తమ నేతలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చిందని, టీఎంసీ పార్టీ కార్యాలయాలపై దాడులకు తెగబడి భయభ్రాంతులకు గురిచేయడం వల్లే ఖాన్ ఎన్నికల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని ఆరోపించింది. ఏదేమైనా, కోర్టు రక్షణ కోల్పోయిన కొద్దిరోజులకే ఈ కీలక నేత నేపాల్ బోర్డర్‌లో ఎస్టీఎఫ్ చేతికి చిక్కడం ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తృణమూల్ కాంగ్రెస్ నేత, ఫాల్టా అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి జహంగీర్ ఖాన్ను పశ్చిమబెంగాల్ పోలీసుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సోమవారం అరెస్ట్ చేసింది. జహంగీర్ ఖాన్ పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతం నుండి దేశం విడిచిపారిపోయేందుకు యత్నించాడని పోలీసులు పేర్కొన్నారు. ఏప్రిల్ 29న ఫాల్తాలో రెండవ దశ పోలింగ్ సమయంలో జహంగీర్ ఖాన్ పై అవతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎన్నికల సంఘం ఆ ఎన్నికను రద్దు చేసి, మే 21న తిరిగి పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అయితే జహంగీర్ ఖాన్ పోటీ నుండి వైదొలిగి, పరారీలో ఉన్నాడు. ఫాల్తాలో జరిగిన రీపోలింగ్ లో బిజెపి అభ్యర్థి లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుచుకున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జహంగీర్ ఖాన్ పై గ్రామస్థులు భూకబ్జా, దోపిడీ ఆరోపణలు చేశారు. పశ్చిమబెంగాల్ లో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత అరెస్ట్ అయిన టిఎంసి నేతల జాబితాలో జహంగీర్ ఖాన్ కూడా చేరారు. మాజీ ఎమ్మెల్యేలతో సహా పలువరు టిఎంసి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2026 మార్చిలో బాంబు పేలుడులో పాత్ర ఉందనే ఆరోపణలపై, గతవారం జాతీయ దర్యాప్తు సంస్థ మాజీ ఎమ్మెల్యే సౌకత్ మూలాను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# ఆశాజనకంగా నైరుతి విస్తరణ

**పలు ప్రాంతాల్లో తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ముందుకు విస్తరిస్తున్నాయి. దీనిప్రభావంతో చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు, మూడు రోజుల్లో తెలంగాణ లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని అధికారులు తెలిపారు. వచ్చే నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఓ మోస్తరు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు పశ్చిమ-దక్షిణ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. ఈనెల 10వతేదీ వరకు హైదరాబాద్ నగరానికి ఎల్లో అలర్ట్ జారీచేసింది. నాలుగు రోజులు నగరంలో భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, యాదాద్రి -భువనగిరి జిల్లాల్లో మోస్తరు వర్షా లు కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వనపర్తి జిల్లా ఏదుల మండలంలో అత్యధికంగా 5.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరులో 4.73 సెంటీమీటర్లు, చౌదాపూర్‌లో 3.58, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో 4.06, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.44, వనపర్తి జిల్లా రేవెల్లిలో 3.38, పన్గల్‌లో 2.72, జోగుళాంబ గద్వాల జిల్లా అ లంపూర్‌లో 2.56, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 2.48సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ**

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది.

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.

ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ఎక్మ్మ్-లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

# హీరోయిన్లను గ్రామరస్‌గా చూపడం అలవాటే

**ఇది టాలీవుడ్‌లోనే తక్కువని చెప్పాలి**

**జాన్వీకపూర్ పై ట్రోల్స్‌కు స్పందించిన నిత్యామీనన్**

**బలగం టీవి, హైదరాబాద్**

'పెద్ది' సినిమా విడుదలైన తర్వాత జాన్వీ కపూర్ పాత్ర చుట్టూ నెలకొన్న వివాదం ఇంకా చర్చనీయాంశం గానే కొనసాగుతోంది. సినిమాలో హీరోయిన్‌ను మరింత గ్లామరస్‌గా చూపించారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశం పెద్ద చర్చకు దారి తీసింది. పలువురు నెటిజన్లు, సినీ ప్రముఖులు దర్శకులను ప్రశ్నిస్తుండగా, మరికొందరు జాన్వీ కపూర్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ వివాదంలో ఇప్పటికే నటీమణులు ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి సహా పలువురు హీరోయిన్లు స్పందించి, హీరోయిన్‌లను విమర్శించడం కంటే దర్శకులను ప్రశ్నించాలని అభిప్రాయపడ్డారు.తాజాగా ఈ అంశంపై నటి నిత్యా మీనన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. హీరోయిన్‌లను కేవలం గ్లామర్ కోణంలో చూపించడం

ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే పరిమితం కాదని, దాదాపు అన్ని చిత్ర పరిశ్రమల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆమె అన్నారు. హీరోయిన్‌లను గ్లామర్ డాల్స్‌లా చూపించడం టాలీవుడ్‌లోనే ఎక్కువగా జరుగుతుందనడం సరైన అభిప్రాయం కాదు. ప్రతి ఇండస్ట్రీలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. ప్రేక్షకులను ఆకర్షించడానికి గ్లామర్ అవసరమనే భావనతో కొంతమంది దర్శకులు, నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. సినిమాలు మరింత కమర్షియల్ అవుతున్న కొద్దీ కొన్ని సందర్భాల్లో హద్దులు దాటే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నిత్యా మీనన్ పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో కేవలం దర్శకులనే తప్పుబట్టడం సరైంది కాదని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. కొంతమంది హీరోయిన్లు గ్లామర్ పాత్రలను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటారు. అదే కారణంగా దర్శకులు కూడా వారిని ఆ కోణంలో చూపిస్తుంటారు. ఇది పూర్తిగా ఒకవైపు జరిగే విషయం కాదు అని అన్నారు. తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా నిత్యా ఈ సందర్భంగా



పంచుకున్నారు. గతంలో కొందరు దర్శకులు నన్ను పూర్తిగా గ్లామర్ ఆధారిత పాత్రల కోసం సంప్రదించారు. కానీ అలాంటి పాత్రలు చేయడం నాకు ఇష్టం లేక నేను తిరస్కరించాను. దాని వల్ల కొన్ని పెద్ద సినిమాల్లో అవకాశాలు కోల్పోయినా బాధపడలేదు. స్టార్‌డమ్ కంటే నా వ్యక్తిగత విలువలు, నేను నమ్మే సిద్ధాంతాలు నాకు ముఖ్యం అని చెప్పారు. పరిస్థితులు మన అభిరుచికి విరుద్ధంగా ఉన్నప్పుడు 'నో' చెప్పగల ధైర్యం ఉండాలి. కానీ కొందరు హీరోయిన్లు టాప్ హీరోయిన్ కావాలనే లక్ష్యంతో లేదా పెద్ద హీరోల సినిమాల్లో అవకాశం కోసం ప్రాధాన్యత తక్కువగా ఉన్న పాత్రలను కూడా అంగీకరిస్తున్నారు. మొదటి నుంచి గ్లామర్ పాత్రల్లో నటిస్తూ వచ్చి, ఒక్కసారిగా అలాంటి పాత్రలు చేయనని చెప్పితే ప్రేక్షకులు కూడా నమ్మరు. చివరికి ఇది ప్రతి హీరోయిన్ వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది అని నిత్యా మీనన్ వ్యాఖ్యానించారు.

## రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్

**బలగం టీవి, హైదరాబాద్**




సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.

## పెద్ది కలెక్షన్ల సునామీ

**300 కోట్ల వసూళ్లకు చేరువలో వసూళ్లు**

**బలగం టీవి, హైదరాబాద్**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. విడుదలైన మొదటి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే రూ.236.7 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం కూడా అదే జోరు కొనసాగించిన 'పెద్ది' మొదటి వీకెండ్ ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా రూ.292.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ, సినిమాను 'బాక్సాఫీస్ ఛాంపియన్'గా అభివర్ణించింది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి కీలక మార్కెట్లలో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్ మరోసారి ఈ వసూళ్ల ద్వారా స్పష్టమైంది. నాలుగు రోజుల్లోనే దాదాపు రూ.300 కోట్లకు చేరువైన ఈ సినిమా, వీక్‌డేస్‌లో కూడా ఇదే స్థాయిలో కలెక్షన్లు కొనసాగిస్తే త్వరలోనే రూ.500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో నటించారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలకమైన కోచ్ పాత్రలో కనిపించగా, జగపతిబాబు 'అప్పలసూరి'గా, దివ్యేందు శర్మ మరో ముఖ్యమైన పాత్రలో నటించారు.

## పెద్దిలో మంచి పాత్రను చేశా

**జాన్వీని ట్రోల్ చేయడం తగదన్న జగపతిబాబు**

**బలగం టీవి, హైదరాబాద్**



'పెద్ది' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో 'అప్పలసూరి' పాత్రలో నటించిన జగపతిబాబు, 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని పేర్కొన్నారు. మధ్యలో ఎన్నో సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురుచూశానని తెలిపారు. చిత్రం విడుదల తర్వాత ఒక ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, 'ఇంత గొప్ప పాత్ర చేసినా మీ గురించి పెద్దగా చర్చ జరగడం లేదు. ఇదే పాత్రను మరో భాష నటుడు చేసి ఉంటే ఇప్పటికే ఎన్నో అవకాశాలు వచ్చేవని చెప్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో నటులకు లభించే గుర్తింపు గురించి కూడా జగపతిబాబు మాట్లాడారు. 'చాలా సందర్భాల్లో పరభాష నటులకు ఎక్కువ గౌరవం దక్కుతుంది. నేను ఇతర భాషల్లో పని చేసినప్పుడు కూడా అలాంటి ఆదరణను చూశాను. అయితే నాకు దానిపై ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ 'పెద్ది' కోసం నేను ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు' అని అన్నారు. షఉటింగ్ సమయంలో తన పాత్రకు వచ్చిన స్పందనను గుర్తుచేసుకుంటూ, ప్రతి సన్నివేశం పూర్తయిన తర్వాత యూనిట్ సభ్యులు చప్పట్లు కొట్టేవారని చెప్పారు. సినిమా కోసం నా శక్తి మేరకు పనిచేశాను. అందుకే ఈ పాత్రకు మరింత గుర్తింపు రావాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. ఈ సినిమా కోసం నేను నా ప్రాణం పెట్టాను. అందుకే గుర్తింపు అడిగే హక్కు నాకు ఉంది. మిగతా సినిమాల విషయంలో నేను ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు అని స్పష్టం చేశారు. ఇక 'పెద్ది'లో హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్రపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శల గురించి కూడా జగపతిబాబు స్పందించారు. నటీనటులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేయడం సరికాదని అన్నారు.జాన్వీ కపూర్ తనకు అప్పగించిన పాత్రను దర్శకుడు చెప్పిన విధంగానే చేసింది. ఒక పాత్ర లేదా కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. కానీ దాని కోసం నటిని వ్యక్తిగతంగా విమర్శించడం సరైంది కాదు. కొన్నిసార్లు మంచి ఉద్దేశంతో చేసిన అంశాలు కూడా ప్రేక్షకుల వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. అంతమాత్రానికే ఒక ఆర్టిస్టును మానసికంగా ఇబ్బంది పెట్టేలా ట్రోల్ చేయడం మంచిది కాదు. ఈ విషయంలో నేను పూర్తిగా జాన్వీకి మద్దతు ఇస్తానని చెప్పారు.




## గీతూమోహన్ దాస్‌కు టాక్సిక్ బృందం విషెస్

**బలగం టీవి, హైదరాబాద్**

యశ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్' ..ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం దర్శకురాలి పుట్టినరోజు సందర్భంగా షఉటింగ్‌లో గీతూకు సంబంధించిన బీటీఎస్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. 'గుండెకు హత్తుకునేలా ఉన్న ప్రతి దృశ్యం వెనుక, మాటల కంటే మౌనమే ఎక్కువగా మాట్లాడిన ప్రతి క్షణం వెనుక.. ఆమె ఉంది' అని పేర్కొన్నారు. కియారా అద్వానీ, నయనతార కథానాయికలు.

## జీ కి దక్కిన వృషకర్మ శాటిలైట్ హక్కులు ?

**బలగం టీవి, హైదరాబాద్**




తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.. 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షఉటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్‌రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్. వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# బాలకృష్ణపై భోలా బాలయ్య గీతం విడుదల



**బలగం టీవి, హైదరాబాద్**

పని చేసేవాళ్లని ప్రపంచం ఇష్టపడుతుంది. పని చేయడమన్నా, సమాజ సేవ అన్నా బాలకృష్ణకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఆయన అభిమానులు ఆ విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో భోళా బాలయ్య... పాట ఆవిష్కరణ వేడుక జరిగింది. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన వ్యక్తిత్వంపై రూపొందిన గీతమిది. పాట విడుదల అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెరపై మంచి చేసే హీరోని చూసి వెళ్లిపోవడం కాదు. ఆయన చేసిన ఆ మంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి. బాలకృష్ణ అభిమానులు ఆ దిశగానే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బాలకృష్ణ అంటే ఏమిటో నేను ఇప్పటికే సినిమాలతో చూపించా. ఆయన అభిమానులు ఏటా పుట్టినరోజు వేడుకని ఓ పండుగలా చేసుకుంటారు. భోళా బాలయ్య పాట చాలా బాగుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.కె.హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అనంతపురం జగన్, గీత రచయిత దివాకర్ అమిలినేని, గాయకుడు కరీముల్లా, సంగీత దర్శకుడు ఈశ్వర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## అభిమానులతో కలసి పెద్దిని వీక్షించిన రామ్‌చరణ్

**బలగం టీవి, హైదరాబాద్**



గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన నటించిన 'పెద్ది' చిత్రాన్ని ఆదివారం రాత్రి చిత్రబృందం, అభిమానులతో కలిసి వీక్షించారు. సినిమాకు వస్తున్న స్పందన, పలు సన్నివేశాలకు ప్రేక్షకులు కనెక్ట్ అయిన తీరును గమనించిన ఆయన ఒకింత భావోద్వేగానికి లోనై కంట తడి పెట్టుకున్నారు. కొన్ని సన్నివేశాలకు ఆడియన్స్ రియాక్ట్ అయిన తీరు చూసి ఆనందించారు. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి వసూళ్ల వర్షం కురిపిస్తోంది. మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.236 కోట్లు కలెక్ట్ చేసింది. మొదటి మూడు రోజులు థియేటర్ల దగ్గర అభిమానులు హవా కొనసాగగా, వీకెండ్ నుంచి ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కడుతున్నారు. మరో పక్క జాన్వీకపూర్ పోషించిన పాత్రపై టోర్లింగ్ జరగగా దర్శకుడు క్షమాపణ చెప్పి అభ్యంతరకర సన్నివేశాలను తొలగిస్తామని తెలిపారు.

## టీమిండియాపై నోరుపారేసుకున్న ఖుష్‌దిల్ షా

**బలగం టీవి, హైదరాబాద్**

దాయాది జట్లు భారత్, పాక్ దేశాల మధ్య జరిగే క్రికెట్ సమరం కేవలం ఆట మాత్రమే కాదు.. అది కోట్ల మంది అభిమానుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ఓ మహా సంగ్రామం. ఇలాంటి హై-వోల్టేజ్ మ్యాచ్‌ల గురించి ఏ చిన్న వివాదాస్పద కామెంట్ వచ్చినా అది క్షణాల్లో సంచలనంగా మారుతుంది. తాజాగా పాకిస్థాన్ ఆల్‌రౌండర్ ఖుష్‌దిల్ షా భారత్-పాక్ మ్యాచ్‌లపై చేసిన కొన్ని వివాదాస్పద కామెంట్లు క్రికెట్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపాయి. భారత్‌తో జరిగే మ్యాచ్‌లలో అంపైరింగ్ నిర్ణయాలతో పాటు చాలా విషయాలు భారత జట్టుకే అనుకూలంగా వెళ్తాయంటూ ఆయన సంచలన ఆరోపణలు చేశాడు.ఓ పాడ్‌కాస్ట్‌లో తన తోటి ఆటగాడు అబ్బాస్ అఫ్రిదితో కలిసి మాట్లాడిన ఖుష్‌దిల్ షా, భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ల సమయంలో ఉండే ఒత్తిడి, భావోద్వేగాల గురించి పంచుకున్నాడు. "భారత్‌తో మ్యాచ్ అంటే ఇరువైపులా ఎమోషన్స్ వేరే లెవెల్‌లో ఉంటాయి. ప్రారంభంలో తీవ్రమైన ఒత్తిడి ఉన్నప్పటికీ, మ్యాచ్ సాగుతున్న కొద్దీ అది తగ్గిపోతుంది. మా కాలంలో మేము కూడా భారత్‌ను ఓడించాము, మంచి పోటీ ఇచ్చాము" అని ఖుష్‌దిల్ పేర్కొన్నాడు.అయితే ఈ చర్చ సాగుతుండగానే ఖుష్‌దిల్ షా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన ఓ కామెంట్ చేశాడు. "భారత్‌తో మ్యాచ్ జరిగేటప్పుడు మైదానంలో చాలా విషయాలు వారికే అనుకూలంగా మారుతాయి. అంపైరింగ్ నిర్ణయాలు కూడా భారత్‌కే ఫేవరెట్‌గా వస్తాయి. అంతెందుకు, డ్రెస్సింగ్ రూమ్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు, అలాగే మ్యాచ్‌ల నిర్వహణ సైతం వారి ఇష్టప్రకారమే జరుగుతున్నట్లు అనిపిస్తుంది" అని ఖుష్‌దిల్ షా ఆరోపించాడు. అయితే తన ఆరోపణలకు మద్దతుగా ఆయన ఎలాంటి నిర్దిష్ట ఉదాహరణలను లేదా మ్యాచ్ సంఘటనలను ప్రస్తావించలేదు.

# ముందింది ఫిఫా వరల్డ్ కప్ సంగ్రామం

**జూన్ 11 నుంచి జులై 19 వరకు టోర్నీ**

**48 జట్లు, 104 మ్యాచ్‌లతో ఫిఫా వరల్డ్ కప్**

**అమెరికా, మెక్సికో, కెనడా దేశాల్లో ఫిఫా సందడి**

**39 రోజులు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ పండుగ**

**బలగం టీవి, హైదరాబాద్**




ఫుట్‌బాల్ ప్రేమికుల కలల వేదిక, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన క్రీడా సంబరం ఫీఫా ప్రపంచకప్ మరోసారి సరికొత్త రికార్డులతో మన ముందుకురాబోతోంది. 2026లో జరగబోయే ఈ టోర్నమెంట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. ఇప్పటి వరకు మనం చూసిన ప్రపంచ కప్‌ల కంటే ఇది భిన్నంగా, భారీగా ఉండబోతోంది. ప్రపంచకప్ ఎందుకు ప్రత్యకమైందో తెలుసుకోవాలంటే ముందుగా దాని పరిమాణాన్ని చూడాలి. గతంలో 32 జట్లు మాత్రమే టోర్నీలో పాల్గొనేవి. కానీ ఈసారి ఏకంగా 48 జట్లు ట్రోఫీ కోసం పోటీ పడబోతున్నాయి. జట్ల సంఖ్య పెరగడంతో మ్యాచ్‌ల సంఖ్య కూడా 104కు చేరుకుంది. ఇది ఫుట్‌బాల్ ప్రపంచంలో అతి పెద్ద, సుదీర్ఘమైన టోర్నమెంట్‌గా నిలవనుంది. సుమారు 39 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులను ఈ టోర్నీ ఉర్రూతలూగించనుంది.

ఈ మెగా టోర్నీకి ఉత్తర అమెరికా ఖండంలోని మూడు దేశాలు కెనడా, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జూన్ 11న మెక్సికో సిటీలోని ప్రతిష్టాత్మకమైన మెక్సికో సిటీ స్టేడియంలో ఘనంగా ప్రారంభంకానుంది. ఆతిథ్య దేశం మెక్సికో తన సొంత గడ్డపై స్థానిక అభిమానుల కేరింత మధ్య తొలి మ్యాచ్ ఆడనుంది. జులై 19న న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో ప్రపంచ విజేత ఎవరో తేలిపోనుంది. ఫుట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఫిఫా జట్ల సంఖ్యను పెంచింది. దీని వల్ల మరిన్ని దేశాలకు ప్రపంచ క్ వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుంది. ఈ క్రమంలోనే కేప్ వెర్డే, కురాకో, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాలు తొలిసారిగా ప్రపంచకప్ బరిలోకి దిగుతున్నాయి. ఇది ఆయా దేశాల్లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి గొప్ప ఊతాన్ని ఇస్తుంది. మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించారు. ఇవి ఏ నుంచి ఎల్ వరకు ఉన్నాయి. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి జట్టు తన గ్రూపులోని మిగిలిన మూడు జట్లతో తలపడుతుంది. గతంలో ఉన్న 8 గ్రూపుల స్థానంలో ఇప్పుడు 12 గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి గ్రూప్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా నాకౌట్ దశకు చేరుకుంటాయి. వీరితోపాటు, 12 గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 8 మూడవ స్థాన జట్లు కూడా నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీని వల్ల మొదటిసారిగా ప్రపంచకప్‌లో రౌండ్ ఆఫ్ 32 అనే కొత్త దశను ప్రవేశ పెట్టారు. అంటే టైటిల్ గెలవాలంటే ఒక జట్టు గతంలో లాగా 7 మ్యాచ్‌లు కాకుండా, ఈసారి 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.




# ఫ్రెంచ్ టైటిల్‌ను ముద్దాడిన జ్వెరెవ్

## పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో విజయం

## ఫ్లావియో కోబోలీని మట్టికరిపించిన జ్వెరెవ్

**బలగం టీవి, హైదరాబాద్**

జర్మనీకి టెన్నిస్ స్టార్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఎట్టకేలకు తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్?ను ముద్దాడాడు. ఆదివారం ఫ్రాన్స్?లో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్?లో జ్వెరెవ్ విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన ఈ ఫైనల్?లో జ్వెరెవ్? ఇటలీకి చెందిన ఫ్లావియో కోబోలీని 6-1, 4-6, 6-4, 6-7, 6-1 తేడాతో ఓడించి ఛాంపియన్‌గా నిలిచాడు. దీంతో జ్వెరెవ్ ఎమోషనల్? అయ్యాడు. విజయం అందుకున్న వెంటనే అతడు నేలపై పడుకొని కన్నీళ్లు కార్చాడు. ఒక్క టైటిల్?కే అంతలా ఎమోషనల్ అవ్వాల్సిన పని ఏముంది అని అనుకోవచ్చు! కానీ జ్వెరెవ్?కు ఇది సాధారణం విజయం కాదు. కెరీర్?లో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈ విజయం సాధించాడు.మనమంతా గ్రౌండ్?లో చూస్తున్న జ్వెరెవ్ వేరు. అతడు ఒక అద్భుత ఆటగాడని అంతరికీ తెలుసు. కానీ, అతడు గత 25ఏళ్లుగా సుదీర్ఘ కాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నాడని అనేక మందికి తెలియని విషయం. 4ఏళ్ల చిన్నతనంలోనే టైప్- 1 డయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్, 25 ఏళ్లుగా అనేక కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా కుంగుబాటుకు గురవ్వకుండా తల్లిదండ్రుల సాయంతో ముందడుగు వేశాడు. వ్యాధితో బాధపడుతున్నా వెనక్కి తగ్గకుండా పోరాడాడు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కెరీర్?లో రాణించాడు.టెన్నిస్?లో కొనసాగాలంటే శారీరక శ్రమ చాలా అవసరం. అందుకే మానసికంగానే కాదు శారీరకంగానూ దృఢంగా ఉండాలి. లేదంటే మ్యాచ్ మధ్యలోనే వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలా ఆటలో రాణిస్తూనే, ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవాలంటే చాలామంది వెనక్కి తక్కుతారు. కానీ జ్వెరెవ్ అలా చేయలేదు. కఠోర శ్రమ, ఎంతో ధైర్యంతో మధుమేహం వ్యాధిని ఎదుర్కొన్నాడు. ఈ ప్రయాణంలో అతడికి తల్లిదండ్రుల ప్రోత్సాహం లభించింది. వాళ్ల మద్దతుతో వెనక్కి తిరిగి చూడకుండా కెరీర్?లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న పిల్లల్లో అవగాహన కల్పించేందుకు జ్వెరెవ్ హెల్త్‌కేర్ టెక్నాలజీకి చెందిన మెడ్‌ట్రోనిక్‌తో జత కట్టాడు. ఈ సమస్యతో బాధపడుతూ నిరాశలో కుంగిపోయిన వాళ్లలో ధైర్యం కల్పించేందుకు ముందుకు వచ్చాడు. 'టెన్నిస్ ప్లేయర్ కావాలనేది నా కల. అయితే ఇలాంటి ఆరోగ్య సమస్య ఉంటే అది సాధించడం అసాధ్యమని అనేక మంది నన్ను నిరుత్సాహపరిచారు. కానీ, నేను నా కుటుంబం దీనిని ఏ మాత్రం అంగీకరించలేదు. అందుకే ఇలాంటి సమస్యతో బాధపడుతున్న చిన్నారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెడ్‌ట్రోనిక్‌తో జత కట్టాను. మధుమేహం సమస్యతో బాధపడుతున్నవాళ్లు వారు కోరుకుంటున్న జీవితాన్ని పొందాలని కోరుకుంటున్నా' అని గతంలో జ్వెరెవ్ ఓ సందర్భంలో చెప్పాడు. అంతేకాదు 2022లో తన సోదరుడితో కలిసి జ్వెరెవ్ ఓ ఫౌండేషన్‌ను స్థాపించాడు. టైప్ - 1 మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ ఇంజక్షన్లు, మందులు అందిస్తున్నాడు. ఇప్పటికీ అతడు టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్నాడు. తాజాగా ఫ్రెంచ్ ఓపెన్‌లో ఓ మ్యాచ్ మధ్యలో జ్వెరెవ్ బ్రేక్ తీసుకొని ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. సమస్యతో పోరాడుతూనే కెరీర్?లో ముందడుగు వేసిన అతడిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# చరిత్ర సృష్టించిన భారత్

- భారత్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడిన అఫ్ఘనిస్థాన్..
- ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో భారీ విజయం!
- భారత స్పిన్‌కు అఫ్గాన్ ఆటగాళ్లు కాకావికాలం
- తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ప్యాకప్
- ఏడు వికెట్లతో సత్తాచాటిన మానవ్ సుతార్
- నిప్పులు చెరిగిన కుల్దీప్, వాషింగ్టన్ సుందర్



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టులో అఫ్ఘనిస్థాన్ జట్టు చిత్తు చిత్తుగా ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయిన అఫ్ఘన్.. రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ముగించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 564/8 పరుగులు చేయడంతో.. ఈ టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టెస్టుతో డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ఓవరాల్‌గా ఏడు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. భారత్ - అఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లో ముగిసిన ఈ టెస్టులో టీమిండియా ఆధిపత్య ధోరణి ప్రదర్శించింది. ఆరంభం నుంచి ఏకపక్షంగా సాగిన ఈ టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ షిప్ 2025 -27లో టీమిండియాకు ఈ విజయం చాలా సపోర్ట్ ఇవ్వనుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ టెస్టులో మూడో రోజు అఫ్ఘనిస్థాన్ రెండుసార్లు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో 113/5తో మూడో రోజు ఆట మొదలుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. మొదటి సెషన్‌లోనే 152 పరుగులకే ఆలౌట్ అయింది. ఫాలో ఆన్ ప్రారంభించిన అఫ్ఘనిస్థాన్ లంచ్ బ్రేక్‌కి ముందు ఎలాంటి వికెట్లు కోల్పోలేదు. లంచ్ బ్రేక్ తర్వాత టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలి వికెట్ తీసుకోగా.. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లను పెవిలియన్‌కు క్యూ కట్టించాడు. ఓపెనర్ సెడికుల్లా అటల్ క్రీజులో ఉన్నంత సేపు కొంచెం పోరాడిన అఫ్ఘనిస్థాన్ ఆ తర్వాత నుంచి కుప్పకూలింది. దాంతో మూడో రోజు ఆట మిగిలుండగానే అఫ్ఘనిస్థాన్ కేవలం 112 పరుగులకే ఆలౌట్ అయింది. అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లలో సెడికుల్లా అటల్ 42, రహ్మానుల్లా గుర్బాజ్ 24, రహ్మత్ షా 13 పరుగులు చేయగా.. మిగతా అందరూ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ బాట పట్టారు. భారత బౌలర్లలో సుందర్ 4, కుల్దీప్ 3, మానవ్ సుతార్ 1, సిరాజ్ 1 వికెట్ పడగొట్టారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 127 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి డిక్లేర్ ఇచ్చింది. కేఎల్ రాహుల్ 100, శుభ్‌మన్ గిల్ 126, సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ 52 పరుగులు చేశాడు. ఈ టెస్టుతో ఎంట్రీ ఇచ్చిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు, రెండో ఇన్నింగ్స్ ఒకటి ఓవరాల్‌గా ఏడు వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు.

412 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్గానిస్థాన్ 35.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సెదిఖుల్లా అటల్(80 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 42), రెహ్మానుల్లా గుర్బాజ్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వాషింగ్టన్ సుందర్(3/30), కుల్దీప్ యాదవ్(4/36) అఫ్గాన్ పతనాన్ని శాసించారు. మానవ్ సుతార్‌కు ఒక వికెట్ దక్కింది. గాయంతో షరాఫుద్దీన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాలేదు. 14 పరుగుల వ్యవధిలోనే అఫ్గాన్ చివరి 6 వికెట్లు కోల్పోవడం గమనార్హం.భారత బౌలర్లలో మానవ్ సుతార్(6/33) 6 వికెట్లతో అఫ్గాన్ పతనాన్ని శాసించగా.. ప్రసిధ్ కృష్ణ(3/37) మూడు వికెట్లతో సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్(1/21) ఒక వికెట్ దక్కింది. భారత్‌కు 412 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. టెస్ట్ క్రికెట్ అనుభవలేమి అఫ్గాన్ కొంపముంచింది. అఫ్గాన్ బ్యాటింగ్ వైఫల్యంతో మూడో రోజు ఆటలో రెండున్నర సెషన్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

స్కోర్లు:
భారత్ తొలి ఇన్నింగ్స్ - 564-8 డిక్లేర్డ్
అఫ్గానిస్థాన్ తొలి ఇన్నింగ్స్ - 152- 10
అఫ్గానిస్థాన్ రెండో ఇన్నింగ్స్ - 112 - 10

**భారత్ సాధించిన అతిపెద్ద ఇన్నింగ్స్ విజయాలు:**

ఇన్నింగ్స్ అండ్ 300 పరుగులు ఆఫ్గానిస్థాన్- ముల్లాన్‌పూర్, 2026లి
ఇన్నింగ్స్ 272 పరుగులు వెస్టిండీస్- రాజ్‌కోట్, 2018
ఇన్నింగ్స్ 262 పరుగులు ఆఫ్గానిస్థాన్- బెంగళూరు, 2018
ఇన్నింగ్స్ 239 పరుగులు బంగ్లాదేశ్- మీర్పూర్, 2007
ఇన్నింగ్స్ 239 పరుగులు శ్రీలంక- నాగ్‌పూర్, 2017




# టెస్టుల్లో అతిపెద్ద విజయం..!

**బలగం టీవి, హైదరాబాద్**

టెస్ట్ క్రికెట్‌లో భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో 94 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే కని వినీ ఎరుగని విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ మ్యాచు ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. దీంతో భారత గడ్డపై టెస్టుల్లో అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 564/8 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ ఇచ్చింది. అనంతరం తమకు అలవాటైన రీతిలో స్పిన్‌తో ప్రత్యర్థికి ఉచ్చు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘానిస్థాన్‌ను 152 పరుగులకు కుప్పకూల్చింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ మరింత చెలరేగిపోయిన భారత బౌలర్లు.. అఫ్ఘానిస్థాన్‌ను 112 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది. సొంత గడ్డపై అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. తాజా ఫలితంతో టెస్టుల్లో అతిపెద్ద విజయం సాధించిన రెండో ఆసియా టీమ్‌గా టీమిండియా నిలిచింది. ఈ జాబితాలో భారత్ కంటే పాకిస్థాన్ ముందు వరుసలో ఉంది. 2002లో లాహోర్‌లో న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ ఇన్నింగ్స్ డ 324 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది.ఈ మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్ డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు గెలుచుకున్నాడు. ఈ మ్యాచులో బ్యాటింగ్‌లో 28 రన్స్ చేసిన అతడు.. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీశాడు. దీంతో టీమిండియా తరఫున ఆడిన తొలి మ్యాచులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

# గెలుపే నా టార్గెట్..

- -నా కెప్టెన్సీ నాదే.. ఎవరి మాట నేను వినను
- -ముంబై స్ట్రీట్ క్రికెట్ నుంచి చాలా నేర్చుకున్నా..
- -టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఇండియా టీ20 టీమ్ కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ అఫీషియల్ గా అనౌన్స్ అయ్యాడు. సెలెక్షన్ కమిటీ మీటింగ్ లో 31 ఏళ్ల అయ్యర్ ను ఈ పొజిషన్ కు ఎంపిక చేశారు. మార్చి నెలలో ఇండియాకు టీ20 వరల్డ్ కప్ అందించి సక్సెస్ ఫుల్ గా నిలిచిన సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో అయ్యర్ బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఈ కొత్త రెస్పాన్సిబిలిటీ పై శ్రేయాస్ అయ్యర్ స్పందిస్తూ, కెప్టెన్ అయ్యాను కదా అని తన పర్సనాలిటీ ని మార్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఎవరి నీడలోనో ఉండటానికి తాను ఇష్టపడనని, ముంబై లో కఠినమైన క్రికెట్ ఎన్విరాన్ మెంట్ లో పెరిగిన పాత శ్రేయాస్ లాగే ఉంటానని స్పష్టం చేశాడు. ముంబై లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచి ఛాలెంజ్ లను ఫేస్ చేయడం అలవాట అయిందని అయ్యర్ ఒక ఈవెంట్ లో గుర్తు చేసుకున్నాడు. అక్కడ క్రికెట్ క్రేజ్ చాలా ఎక్కువని, స్ట్రీట్ లో ఆడే ప్రతి చిన్న పిల్లాడు ముంబై టీమ్ కు ఆడాలని కలలు కంటాడని చెప్పాడు. అటువంటి హై కాంపిటీషన్ నుంచి రావడం వల్లే తన మైండ్ సెట్ ఎప్పుడూ గెలవడం పైనే ఉంటుందని తెలిపాడు. ప్రతి మ్యాచ్ లో గెలవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం తన అలవాటని, ఈ కంపిటీటివ్ నేచరే తనను ఈ స్టేజ్ కి తీసుకొచ్చిందని అన్నాడు. ఇప్పుడు వచ్చిన



కెప్టెన్సీ ఒక గ్రేట్ ఛాలెంజ్ అని, దీన్ని లీడ్ చేయడానికి తాను రెడీగా ఉన్నానని హింట్ ఇచ్చాడు. శ్రేయాస్ అయ్యర్ కు కెప్టెన్సీ ఇవ్వడం పై బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పాజిటివ్ గా రెస్పాండ్ అయ్యాడు. అయ్యర్ బాగా పర్ఫార్మ్ చేశాడని, ఈ కెప్టెన్సీ రోల్ కు అతడు వంద పర్సెంట్ అర్హుడని ప్రశంసించాడు. అలాగే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తీసేయడం అన్యాయం ఏమీ కాదని, సెలెక్టర్లు టీమ్ ఫ్యూచర్ ను దృష్టిలో ఉంచుకొని ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నారని గంగూలీ వ్యాఖ్యానించాడు. కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ కు ఐర్లాండ్ టూర్ ఫస్ట్ అసైన్ మెంట్ కాబోతోంది. అక్కడ ఇండియా టూ టీ20 మ్యాచ్ లు ఆడనుంది. అయ్యర్ డిసెంబర్ 2023 లో తన లాస్ట్ టీ20 మ్యాచ్ ఆడాడు, ఆ తర్వాత ఫామ్ కోల్పోయి టీమ్ లో ప్లేస్ పోగొట్టుకున్నాడు. ఇప్పుడు మళ్లీ మిడిల్ ఆర్డర్ లో సూర్యకుమార్ యాదవ్ కు లైక్-టు-లైక్ రీప్లేస్ మెంట్ గా టీమ్ లోకి వచ్చి డైరెక్ట్ గా కెప్టెన్ సీటును దక్కించుకోవడం విశేషం.

సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత టీ20 జట్టు విజేతగా నిలిచింది. భారత్ గెలిచినా.. సూర్య దారుణంగా విఫలమయ్యాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్‌తో తన సారథ్య ప్రతిభతో ఆకట్టుకున్నాడు. ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టడమే కాకుండా ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లాడు.తాజా సీజన్‌లోనూ జట్టును మెరుగ్గా నడిపించాడు. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ సత్తా చాటాడు. దాంతో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శ్రేయస్ వైపు మొగ్గు చూపింది. శ్రేయస్ రాకతో సూర్య కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది.



# టెస్ట్ డెబ్యూ లోనే మానవ్ సుతార్ హిస్టారికల్ రికార్డ్..

**బలగం టీవి, న్యూఢిల్లీ**


ఇండియా వర్సెస్ అఫ్గానిస్తాన్ ఏకైక టెస్ట్ మ్యాచ్ సెకండ్ డే ఆటలో ఒక వండర్‌ఫుల్ సీన్ కనిపించింది. టీమిండియా యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ డెబ్యూ మ్యాచ్ లోనే అద్భుతమైన ఇంపాక్ట్ చూపించాడు. న్యూ చండీగఢ్ లోని ముల్లాన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టీ టైమ్ కంటే జస్ట్ ముందే బాల్ ను సుతార్ కు ఇచ్చాడు. క్రీజులోకి వచ్చిన ఈ 23 ఏళ్ల యంగ్ ప్లేయర్ కేవలం నాలుగు బాల్స్ లోనే తన టాలెంట్ ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు.మానవ్ సుతార్ వేసిన ఫస్ట్ ఓవర్ ఫోర్త్ బాల్ కు అఫ్గాన్ ఓపెనర్ అబ్దుల్ మాలిక్ స్వీప్ షాట్ కొట్టడానికి ట్రై చేశాడు. అయితే బాల్ టాప్ ఎడ్జ్ అయి గాల్లోకి లేవగా, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ నుంచి మొహమ్మద్ సిరాజ్ ముందుకు డైవ్ చేస్తూ ఒక షార్ప్ క్యాచ్ ను అందుకున్నాడు. ఈ వికెట్ పడగానే టీమిండియా ప్లేయర్స్ అందరూ సుతార్ ను హగ్ చేసుకుంటూ గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సాలిడ్ బ్రేక్‌త్రూతో సుతార్ తన కెరీర్ లోనే మర్చిపోలేని మెమరబుల్ మూమెంట్ ను సొంతం చేసుకున్నాడు. ఇండియా టెస్ట్ క్రికెట్ హిస్టరీలో డెబ్యూ మ్యాచ్ లోనే ఫస్ట్ ఓవర్ లో వికెట్ తీసిన ఎనిమిదో ఇండియన్ క్రికెటర్ గా మానవ్ సుతార్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు. దాదాపు 8 దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ అరుదైన క్లబ్ లో ఇంతకుముందు మొంటు బెనర్జీ (1948), మనోహర్ హార్డికర్ (1958), వామన్ కుమార్ (1961), చేతన్ శర్మ (1984), డబ్ల్యూవీ రామన్ (1988), నిలేష్ కుల్కర్ణి (1997), టిను యోహానన్ (2001) మాత్రమే ఉన్నారు. 2001 లో ఇంగ్లాండ్ పై టిను యోహానన్ ఈ ఫీట్ సాధించిన తర్వాత మళ్లీ 25 ఏళ్ల వరకు ఏ ఇండియన్ బౌలర్ కూడా ఫస్ట్ ఓవర్ లో వికెట్ తీయలేదు. ఆ రికార్డును సుతార్ ఇప్పుడు రిపీట్ చేశాడు. స్పిన్ ఆల్ రౌండర్ హర్ష్ దూబేను పక్కన పెట్టి మానవ్ సుతార్ ను టీమ్ లోకి తీసుకోవడం పర్ఫెక్ట్ డెసిషన్ అని సుతార్ నిరూపించాడు. మ్యాచ్ స్టార్ట్ కావడానికి ముందు సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ చేతుల మీదుగా సుతార్ టెస్ట్ క్యాప్ నంబర్ 319 ను అందుకున్నాడు. 2021 లో అక్షర్ పటేల్ డెబ్యూ చేసిన తర్వాత టీమిండియా తరఫున టెస్ట్ ఫార్మాట్ లో ఎంట్రీ ఇచ్చిన ఫస్ట్ స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ గా మానవ్ సుతార్ నిలిచాడు.

.....

# టెస్ట్ క్రికెట్‌లో అనుభవం లేకపోవడంతోనే ఓటమి

## అఫ్గానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ వ్యాఖ్యలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



టెస్ట్ క్రికెట్‌లో ఆడిన అనుభవం లేకపోవడంతోనే ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నామని అఫ్గానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ అన్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించిందని అభినందనలు తెలిపాడు. మానవ్ సుతార్ అద్భుతమైన బౌలింగ్‌కు చేతులెత్తేసామని, పిచ్ కూడా మారిందని, స్కోర్ బోర్డు ఒత్తిడి కూడా తమ పతనాన్ని శాసించిందని చెప్పాడు. ముల్లాన్‌పూర్ వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన హష్మతుల్లా..ఓడినా సానుకూల అంశాలు ఉన్నాయని చెప్పాడు.'భారత్‌కు నా అభినందనలు. ఇది మాకు ఒక కఠినమైన రోజు. కఠినమైన మ్యాచ్. మ్యాచ్ ఆరంభం నుంచే మేం వెనుకపడ్డాం. మా బౌలింగ్‌లో క్రమశిక్షణ లేదు. ఆరంభం నుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. నిజం చెప్పాలంటే.. మాకు ఈ ఫార్మాట్‌లో అంతగా అనుభవం లేదు. ఈ మ్యాచ్ నుంచి మేం చాలా నేర్చుకున్నాం.ఎందుకంటే మాకు ఈ ఫార్మాట్ ఆడేందుకు తగినన్ని అవకాశాలు లభించవు. కానీ తమ సొంత పరిస్థితులలో ఆడేటప్పుడు ఇండియా చాలా కఠినమైన జట్టు అని అందరికీ తెలుసు. అయితే మాకు చాలా పాఠాలు లభించాయి. ఈ ఓటమి నుంచి మేము నేర్చుకుంటాం. పరిస్థితులు మరింత కఠినంగా మారినప్పుడు.. ఒత్తిడిలో ఎలా ఆడాలో ఈ మ్యాచ్ మాకు నేర్పించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా మాకు కొన్ని సానుకూల అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా సలీమ్ అద్భుతంగా రాణించాడు. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీలోనే సత్తా చాటాడు. అలాగే బ్యాటింగ్‌లో రహమత్ తొలి ఇన్నింగ్స్‌లో చాలా బాగా ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లో సెదిక్ పర్వాలేదనిపించాడు. మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను స్టంప్-టు-స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేశాడు. చాలా క్రమశిక్షణతో బౌలింగ్ చేయడంతో అతన్ని ఎదుర్కోనేందుకు మేం ఇబ్బంది పడ్డాం. పిచ్ ప్రవర్తన కూడా సెషన్ సెషన్ మారుతూ వచ్చింది. స్కోర్ బోర్డ్ ఒత్తిడి కూడా మా ఓటమిని శాసించింది. మానవ్ సుతార్ మాత్రం చాలా క్రమశిక్షణతో బౌలింగ్ చేశాడు.'అని హష్మతుల్లా షాహిదీ చెప్పుకొచ్చాడు.

# బౌలర్లు అలసిపోకపోవడంతోనే ఫాలో ఆన్ ఆడించాం

## టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్

**బలగం టీవి, న్యూఢిల్లీ**




తమ బౌలర్లు అలసిపోకపోవడంతోనే అఫ్గానిస్థాన్‌ను ఫాలో ఆన్ ఆడించామని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ప్రస్తుతం భారత టెస్ట్ టీమ్ సంధి దశలో ఉందని, పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ విభాగంలో మార్పులు ఉంటాయని చెప్పాడు. ముల్లాన్‌పూర్ వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన గిల్.. ఇది సంపూర్ణ విజయమని తెలిపాడు. 'ఇది ఒక సంపూర్ణమైన విజయం. మూడు విభాగాల్లో రాణించాం. అందుకే ఈ విజయం చాలా సంతోషాన్నిచ్చింది. వాతావరణం చాలా వేడిగా ఉంది. లంచ్‌కు ముందు లేదా మొదటి డ్రింక్స్ విరామం తర్వాతే వారిని ఆలౌట్ చేస్తే.. మా బౌలర్లు అలసిపోకుండా ఉన్నారో లేదో చూసి ఫాలో-ఆన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఒకవేళ అలా కాకపోతే.. మేం ఒక రెండు సెషన్ల పాటు బ్యాటింగ్ చేసి.. చివర్లో అఫ్గాన్‌కు బ్యాటింగ్ అప్పగించాలని అనుకున్నాం. కానీ మాకు వేగంగా వికెట్లు దక్కాయి. దాంతో మ్యాచ్‌పై పట్టు సాధించాం. అలాగే మా ఫాస్ట్ బౌలర్లు బౌలింగ్ చేసిన తీరు కూడా అద్భుతం. మేం ఫాలో-ఆన్ ఇచ్చినప్పుడు సిరాజ్ కీలకమైన వికెట్ అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ప్రసిద్ధ్ మూడు ముఖ్యమైన వికెట్లు తీశాడు.మానవ్ సుతార్, వాషింగ్టన్, కుల్దీప్‌ల నైపుణ్యం, నాణ్యతపై మాకు ఎలాంటి సందేహం లేదు. కానీ ఎక్కువ ఓవర్లు వేయించి వారికి తగి అనుభవం దక్కేలా చూశాం. ఇలాంటి పిచ్‌లపై బ్యాటర్లను ఎలా బోల్తా కొట్టించాలి, పేస్‌ను ఎలా మారుస్తూ ఉండాలి, వేర్వేరు ఏరియాల్లో బ్యాటర్లను ఎలా పరీక్షించాలి అనే విషయాలను తెలుసుకోవడం ముఖ్యం.ఇది యువ జట్టు. ట్రాన్సిషన్ దశలో ఉంది. కాబట్టి జట్టులో మార్పులు ఉంటాయి. అయితే పరిస్థితులు, వేదికలతో సంబంధం లేకుండా ముందుగా బ్యాటింగ్ చేసినప్పుడు బోర్డుపై 350 పరుగులు ఉంచడానికి ప్రయత్నించాలి. ఎక్కడైనా సరే 20 వికెట్లు తీయగలరనే నమ్మకం మా బౌలింగ్ గ్రూప్‌పై ఉంది. జట్టులో మార్పులు జరుగుతున్నప్పుడు.. బ్యాటింగ్ గ్రూప్‌పై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. మేం అనుభవాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తున్నాం. ఒక బ్యాటింగ్ గ్రూప్‌గా వేర్వేరు పరిస్థితుల్లో.. వేర్వేరు సందర్భాలలో ఏ విధమైన ఆట తీరు జట్టుకు ఉపయోగపడుతుందో తెలుసుకోవడానికి, బలమైన జట్టును నిర్మించడానికి మేం ప్రయత్నిస్తున్నాము. అలాగే స్కోర్‌బోర్డ్‌పై క్రమం తప్పకుండా 350-400 పరుగులు ఎలా ఉంచాలో చూస్తున్నాం.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

# పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రకంపనలు..

## కెప్టెన్, కోచ్‌పై పీసీబీ వేటు?

**బలగం టీవి, న్యూఢిల్లీ**

పాకిస్తాన్ టెస్టు జట్టులో కీలక మార్పులు చేసే విధంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లో పాకిస్తాన్ 0 - 2తో ఘోర ఓటమిపాలయింది. ఈ సిరీస్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లు దారుణంగా విఫలమయ్యారు. ఈ కారణంతో టెస్టు హెడ్ కోచ్, కెప్టెన్లపై వేటు వేయాలన్న ఆలోచనలో పీసీబీ ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే సర్ఫరాజ్ అహ్మద్, షాన్ మసూద్‌ని తమ తమ బాధ్యతల నుంచి తొలగించే అవకాశం ఉంది. పాకిస్తాన్ జట్టులో ఎప్పుడూ ఏదోక ఇష్యు నడుస్తూనే ఉంటుంది. కెప్టెన్లు, కోచ్ మార్పులో చాలా ఫాస్ట్‌గా ఉండే పీసీబీ ఇప్పుడు పాకిస్తాన్ టెస్టు టీమ్‌పై వేటు వేసేందుకు సిద్ధమైంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 0 - 2తో ఘోర ఓటమిపాలయింది. మంచి మంచి ప్లేయర్లు ఉన్నప్పటికీ పాకిస్తాన్ కనీసం ఒక్క మ్యాచ్‌లో కూడా డ్రా చేయలేకపోయింది. దాంతో జట్టులో కీలక మార్పులు చేసే ఆలోచనలో పీసీబీ ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ టెస్టు జట్టు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, కెప్టెన్ షాన్ మసూద్‌పై వేటు వేసే ఆలోచనలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఉన్నట్లు సమాచారం. పీసీబీ వర్గాల ప్రకారం.. మాజీ ప్లేయర్లు యూనిస్ ఖాన్, మొహమ్మద్ హాఫీజ్‌తో బోర్డు కీలక పదవులపై చర్చలు జరుపుతోంది. బంగ్లాదేశ్ చేతిలో సిరీస్ ఓటమి తర్వాత పాకిస్థాన్ టెస్టు వ్యవస్థలో సమూల మార్పులు చేయాలని పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ సలహాదారులు సూచించినట్లు సమాచారం. వాళ్ల ప్రకారం టెస్టు జట్టు హెడ్ కోచ్ పదవి నుంచి సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించి, మళ్లీ అండర్ 19, ఏ జట్ల బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనలో పీసీబీ ఉంది. అయితే యూనిస్ ఖాన్‌తో ఒప్పందం కుదిరిన తర్వాతే సర్ఫరాజ్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సర్ఫరాజ్‌తో పాటు పాకిస్తాన్ టెస్టు కెప్టెన్ షాన్ మసూద్‌ను కూడా మార్చాలని పీసీబీ చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే




వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనల్లో మరో అవకాశం ఇవ్వాలని మసూద్ బోర్డును కోరినట్లు తెలుస్తోంది. అయితే, మొహమ్మద్ హాఫీజ్‌ను చీఫ్ సెలెక్టర్‌గా నియమించడంతో పాటు ఐసీసీ విభాగానికి కూడా బాధ్యతలు అప్పగించే అంశాన్ని పీసీబీ పరిశీలిస్తోంది. కొంతకాలంగా హాఫీజ్ క్రికెట్ డిబేట్లలో బోర్డుపై విమర్శలు గుప్పిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇప్పుడు హాఫీజ్‌కు పదవి ఇవ్వడం విమర్శలను ఆపేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని మరికొందరు అంటున్నారు. మొత్తానికి బంగ్లాదేశ్ సిరీస్ పరాజయం తర్వాత పాకిస్తాన్ క్రికెట్‌లో పెద్ద ఎత్తున మార్పులు జరిగే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.